క్లుప్తంగా

డోన్ రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



రాకేష్

డోన్ రూరల్: స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా సీఎం రాకేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న అస్రత్‌బాషా వీఆర్ ఎస్పీ నంద్యాలకు వెళ్లారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్యాపిలి సీఐ బాధ్యతలు



వెంకటరామిరెడ్డి

ప్యాపిలి: సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటరామిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సుధాకర్ రెడ్డి నంద్యాల టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుత్తి నుంచి బదిలీపై వచ్చిన వెంకటరామిరెడ్డి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఐను కలిసిన హిందూ ధార్మిక సంఘాలు



సీఐకి భగవద్గీతను బహూకరిస్తున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు

బేతంచెర్ల: మండల సీఐగా బాధ్యతలు తీసుకున్న వెంకటేశ్వరరావును విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, హిందూ ధార్మిక సంఘాల నాయకులు హుసేన్‌రెడ్డి, మారుతి కృష్ణ, శ్రీనివాసులు రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మండల కేంద్రంలో జరిగే పండుగలు, ఉత్సవాలను సీఐకి వివరించారు. సీఐకి భగవద్గీతను బహూకరించారు. హిందూ ధార్మిక సంఘాల నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, నాగమోహన్, హరికృష్ణ, శ్రీను, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడి మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల రిటైర్డ్ వ్యాయమ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి శనివారం ఉదయం మృతిచెందారు. ఆయన మృతిపై ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సంతాపం తెలిపారు. ఎంతో మంది విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేర్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్: నిరుపేద కుటుంబంలో చనిపోయిన వ్యక్తి అంత్యక్రియల కోసం స్ఫూర్తి సంస్థ రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. డోన్ పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ శివ(33) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న స్ఫూర్తి సభ్యులు దాతల సహకారంతో మృతుని తల్లికి ఆర్థిక సాయం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు, సభ్యులు రాము, నారాయణస్వామి, మోహన్‌రెడ్డి, శేఖర్ ఉన్నారు.

వీఆర్‌ఏల నూతన కమిటీ

డోన్ టౌన్: మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సంఘం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా పెద్ద మల్కాపురం వీఆర్‌ఏ రవి కుమార్, ఉపాధ్యక్షులుగా గుండాల గ్రామానికి చెందిన శివశంకర వరప్రసాద్, కార్యదర్శిగా కామగానికుంట్లకు చెందిన మహేశ్వర నాయుడు, సహాయ కార్యదర్శిగా యాపదిన్నె రంగయ్య, కోశాధికారిగా చనుగొండ్లకు చెందిన హరికృష్ణ, ప్రధాన సలహాదారునిగా మల్కాపురానికి చెందిన రామచంద్రుడుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

గంగమ్మకు జలహారతి

అవుకు: అవుకు రిజర్వాయర్ నిండడంతో తిమ్మరాజుచెరువు కట్ట వద్ద ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి శనివారం గంగమ్మకు జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కాల్వల మరమ్మతులకు త్వరలోనే పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్‌లో 3 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. అనంతరం చెర్లోపల్లె గ్రామ సమీపంలోని హెడ్‌రెగ్యులర్ గేట్ల ద్వారా మూడు గేట్లను ఎత్తి వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్‌కు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సీఈ కబీర్‌బాషా, ఎస్ఈ వరప్రసాద్, ఈఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక.. పచ్చమాయ

- అందుబాటులో లేని రీచ్‌లు
- ట్రాక్టర్ ఇసుకు రూ. 9 వేలు
- ఇసుక దొరక్క అవస్థలు
- ఇసుక లేక ఎక్కడికక్కడ ఆగిన నిర్మాణ పనులు
- కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం



రూ.9 వేలు చెల్లించి ఇసుక కొనుగోలు చేసి అన్‌లోడ్ చేసుకుంటున్న దృశ్యం

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పేరుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలను దగా చేస్తోంది. పేరుకు మాత్రం ఉచిత ఇసుక పాలసీ అంటున్నా రీచ్‌లు సుదూరంలో ఉండడంతో ఇసుక దొరక్క అవస్థలు పడుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల ప్రజలకు వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నా నది పరివాహకంలో ఇసుక అందుబాటులో ఉంది. అయితే ఇక్కడ రీచ్ ఏర్పాటు చేయకుండా అదే జిల్లా రైల్వే కొండాపురం వద్ద ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. రీచ్ సుదూరంలో ఉండడంతో ఆయా మండలాల ప్రజలు ఇసుక కోసం ఇబ్బందులు పడుతున్నారు.

ట్రాక్టర్ ఇసుక రూ. 9 వేలు పైమాటే

ఇసుక రీచ్‌లు అందుబాటులో లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రజలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఇసుకను కొనుగోలు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారునికి 20 టన్నుల ఉచిత ఇసుక సరఫరా చేసింది. ఉచితంగా ఇసుక, రాయితీపై కడ్డీలు ఇవ్వడంతో పేద ప్రజలు ఇళ్లు నిర్మించుకుని సొంతింటి కల నెరవేర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పేరుతో ప్రజలకు ఇసుక దొరక్కుండా చేస్తుండడంతో ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది టన్నులు ఉన్న ట్రాక్టర్ ఇసుకకు రూ. 9వేలకు పైగా చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు దాపరించాయి. అంత మొత్తం చెల్లించినా సకాలంలో ఇసుక దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇళ్ల, వివిధ వ్యాపార సముదాయాలకు సంబంధిచిన నిర్మాణాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు అందుబాటులో రీచ్‌లు ఏర్పాటు చేసి ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలి



స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఇంటి నిర్మాణం చేపట్టాను. ఇసుక ఉచితంగా అందుతుందని భావించాను. రీచ్ సుదూరంలో ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి ఇసుక తరలించుకోవాలంటే అనేక వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇసుక దొరక్కపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద ట్రాక్టర్ ఇసుకకు రూ. 9 వేలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. –నాగయ్య, కోవెలకుంట్ల

ఇసుక దొరక్క అవస్థలు



ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అందుబాటులోకి తెచ్చింది. ప్రజలకు కావాల్సిన ఇసుకను సరఫరా చేయకపోవడంతో వివిధ వర్గాల ప్రజలు ఇసుక కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేసింది. ప్రస్తుతం ఇసుక దొరక్కపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. –రఘు, స్వామినగర్, కోవెలకుంట్ల

సీబీఎస్ఈ పరీక్షలపై అవగాహన

కొలిమిగుండ్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి జరగనున్న సీబీఎస్ఈ ఆన్‌లైన్ పరీక్షలపై ఇన్‌చార్జ్ హెచ్ఎం హుసేనయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల సీబీఎస్ఈకి ఎంపికైంది. ప్రస్తుతం 80 మంది పదో తరగతి విద్యార్థులు అభ్యసిస్తున్నారు. విద్యార్థులకు గత ప్రభుత్వంలో ఇచ్చిన ట్యాబ్‌లలోనే పరీక్షలు రాయనున్నారు. సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం విద్యా సంవత్సరంలో నాలుగు సార్లు విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ పరీక్షలు రాసేందుకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. అయితే సర్వర్ సమస్య కారణంగా ట్యాబ్‌లు సరిగ్గా పనిచేయడం లేదు.

దాడి కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వరమ్మ, ఆమె కుమారుడు శివరంజన్‌ను అదే గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్, అతని కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిప్స్ ఫ్యాక్టరీ లీజు విషయంలో దాడి చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం వలి శనివారం తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మానిక్యంశెట్టి అన్నారు. యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాతబస్టాండ్ సమైఖ్యాంధ్ర కట్ట వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి పోరాటాల ద్వారా సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలే కాకుండా సమాజంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా పూర్వ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ బాబు, ఉపాధ్యక్షుడు శంషాద్‌బేగం, కోశాధికారి సుమన్, నాయకులు లక్ష్మయ్య, లక్ష్మీకాంతరెడ్డి, లతీఫ్, సుబ్బరాయుడు, అల్లీపీరా, రమేష్, రహీం, గోపాల్, బాలరంగారెడ్డి, మద్దిలేటి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలిక వైద్య చికిత్సకు రూ.లక్ష ఆర్థిక సాయం



బాలిక తల్లికి నగదు అందజేస్తున్న పోచా వెంకట రామిరెడ్డి

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామానికి చెందిన ఎం.సుకన్యకు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలారెడ్డి, సంజామల ఎంపీపీ పోచా రమాదేవి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన వెంకటరమణ, నాగలక్ష్మి దంపతుల కుమార్తె సుకన్య ముక్కమల్ల ప్రథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. కొద్ది రోజులు క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చూపించారు. లివర్ చెడిపోయిందని డాక్టర్లు ధృవీకరించారు. అప్పటి నుంచి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న పోచా శీలా రెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట రామిరెడ్డి చలించిపోయారు. వైద్య ఖర్చులకు రూ.లక్ష నగదును సుకన్య తల్లి నాగ లక్ష్మికి ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి శనివారం అందించారు. సుకన్యకు లివర్ ఆపరేషన్‌కు సూమారు రూ.30 లక్షలు అవుతుందని డాక్టర్లు తెలిపారని.. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరించేలా చూడాలని సుకన్య తల్లితండ్రులు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు

ప్యాపిలి: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకుడు మాణిక్యం శెట్టి డిమాండ్ చేశారు. స్థానిక కొత్తబస్టాండ్ వద్ద ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యావ్యవస్థను తూట్లు పొడిచే జీఓ నంబర్ 117ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని కోరారు. 50 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. సంఘం ఆవిర్భవించిన తొలి రోజుల్లోనే దేశంలో ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఉపాధ్యాయుల పక్షాన నిలిచిన ఏకైక సంఘం యూటీఎఫ్ అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు లక్ష్మయ్య, అబ్దుల్ లతీఫ్, నరసింహారెడ్డి, శాంతిప్రియ, శేషయ్య, ఆంజనేయ ప్రసాద్, రాజేంద్ర, అంజనప్ప, సర్వజ్ఞమూర్తి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో విద్యారంగానికి ప్రమాదం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాం బేగ్

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం అధికారుల మాయలో పడి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వ విద్యారంగానికి పెను ప్రమాదం అని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్, జిల్లా కార్యదర్శి పుల్లయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. వేల సంఖ్యలో ఉపాధ్యాయుల పోస్టులు రద్దు కావడమే కాకుండా సుమారు 16 వేల మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మిగులు ఉన్నట్లు, అదే విధంగా 9 వేల మంది ఎస్ఏ ఉపాధ్యాయులు అవసరం ఉన్నట్లు విద్యా గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటుకు తొందర పడకుండా ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. నాయకులు ఆదినారాయణ, సుబ్బారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పాపా రాయుడు, క్రిష్ణ పాల్గొన్నారు.



వల్లంపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

కుందూనదికి తగ్గని వరద

- పొలాల్లో చేరిన వరదనీరు
- వరి సాగుకు ఆటంకం

కోవెలకుంట్ల: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి భారీగా నీటిని విడుదల చేయడంతో పది రోజుల నుంచి నదికి వరదనీరు పోటెత్తుతోంది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో 30 గ్రామాల రైతులు ఏటా కుందూనది నీటి ఆధారంగా వరి, జొన్న, తదితర పంటలు సాగు చేస్తున్నారు. నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నది పరివాహ ప్రాంతాల్లోని పొలాల్లో వరదనీరు చేరింది. ప్రస్తుతం వరిసాగుకు అదును కావడంతో రైతులు వరి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. నది పరివాహక పొలాలను వరద ముంచెత్తడంతో సాగుకు ఆటంకంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే పంటలు సాగు చేసేందుకు అస్కారం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నదికి నీటి విడుదల తగ్గించి పంటల సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ అయ్యల చెర్వులోని పాలీష్ ఫ్యాక్టరీలో పని ముగించుకుని శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జేసీగా బుగ్గానిపల్లె వాసి



జాయింట్ కలెక్టర్ చిన్న రాముడును అభినందిస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామానికి చెందిన చిన్న రాముడును తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏపీ షెడ్యూలు కులాల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్న ఆయన్ను జేసీగా నియమించడంతో స్వగ్రామం బుగ్గానిపల్లె గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు.. ఇదేం పని

- రోడ్లపై తాళ్లు అడ్డుపెట్టి చందాలు వసూలు



కొలిమిగుండ్లలో తాళ్లు అడ్డుపెట్టి చందాలు వసూలు చేస్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటు కోసం విద్యార్థులు రోడ్డెక్కి చందాలు వసూలు చేస్తున్నారు. శనివారం కొలిమిగుండ్లలోని నాయినపల్లె రోడ్డు, తిమ్మనాయినపేట, చింతలాయిపల్లె తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారులపై విద్యార్థులు తాళ్లు అడ్డుపెట్టి రాకపోకలు సాగించే వాహనచోదకుల నుంచి చందాలు వసూలు చేస్తున్నారు. చందాల కోసం వాహనదారులను అడ్డగిస్తుండడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అత్యవసర పనులపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న క్రమంలో ఇలా ప్రధాన రహదారులపై తాళ్లు అడ్డువేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది అంకిరెడ్డిపల్లెలోని చింతలాయిపల్లె రోడ్డులో ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వాహనాలు వేగంగా వెళుతుండడంతో వెంటపడుతున్న సమయంలో ఎక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

పరిశుభ్రమైన నీటి సరఫరాకు చర్యలు



వాటర్ ట్రీట్‌మెంట్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

డోన్: పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత వాటర్ వర్క్స్ సిబ్బందిపై ఉందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. స్థానిక పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న 11.20 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శనివారం పరిశీలించారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి సరఫరా అవుతున్న వర్షపు నీటిని తాగునీటిగా మార్చే ప్రక్రియను పరిశీలించారు. పైపులైన్లు లీకేజీ కాకుండా చూడాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. లీకేజీల వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని.. ఎప్పటికప్పుడు పైప్‌లైన్‌ల సామర్థ్యాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ కాలనీ, పాతబస్టాండ్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు.

చెరువుల్లో కనిపించని జలకళ

- మోస్తరు వర్షాలకే పరిమితం
- చెరువుల్లో అడుగంటిన నీళ్లు



తిమ్మనాయినపేట చెరువులో స్వల్పంగా ఉన్న నీరు

కొలిమిగుండ్ల: ఐదేళ్ల పాటు సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు నిండుగా ఉండి జలకళ సంతరించుకున్నాయి. భూగర్భ జలాలు సైతం అమాంతం పెరిగాయి. ఈ ఏడాది వరుణుడి ప్రభావం అంతంత మాత్రంగానే ఉండడంతో ఇప్పటి వరకు మోస్తరు వానలకే పరిమితమైంది. భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో ఉన్న కాసిన్ని నీళ్లు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. కొలిమిగుండ్ల మండలంలో సాగునీటి వనరులు లేకపోవడంతో రైతులు వర్షాధారం, బోరు బావుల కింద రకరకాల పంటలు పండిస్తుంటారు. ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు చిరుజల్లులు, మోస్తరు వర్షం మాత్రమే కురిసింది. మూడు రోజుల క్రితం 30.8 మి.మీ వర్షపాతం కురవడంతో సాగులో ఉన్న కంది, మినుము తదితర పంటలకు కొంత వరకు ఉపశమనం కలిగించింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 68.4 మి.మీ కాగా 173 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలైలో సాధారణం 101.7 మి.మీ కాగా కేవలం 57.4 మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 131.5 మి.మీ కాగా ఇప్పటి వరకు 37.2 మి.మీ మేర కురిసింది. భారీ వర్షాలు కురిసి చెరువులు పూర్తిస్థాయిలో నిండకపోతే రానున్న రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో కొలిమిగుండ్ల–నాయినపల్లె సమీపంలో సద్దలవెంగన్న చెరువు, తిమ్మనాయినపేట, హనుమంతుగుండం చిన్న, పెద్ద చెరువులు, అబ్దులాపురం సమీపంలో దెయ్యాల చెరువులు ఉన్నాయి. అబ్దులాపురం, కోర్నపల్లె గ్రామాల్లో 300 ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు, ఇప్పటికే వంద ఎకరాలకు పైగా నాట్లు వేస్తున్నారు. చెరువులో నీళ్లు లేకపోవడంతో బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోతాయని రైతులు దిగాలు చెందుతున్నారు. తిమ్మనాయినపేట, హనుమంతుగుండం చెరువుల పరిధిలోని రైతుల పరిస్థితి ఇలాగే తయారైంది. వరుణుడు కరుణించి చెరువులు నిండకపోతే సాగు నీటి బోర్లతో పాటు గ్రామాల్లో మంచినీటి సమస్యకు ప్రమాదం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



తరగతుల నుంచి విద్యార్థులను బయటకు పంపిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డోన్ టౌన్: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తూ రెండో శనివారం, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి డిమాండ్ చేశారు. పట్టణంలో రెండో శనివారం తరగతులను నిర్వహిస్తున్న పలు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను బయటకు పంపారు. పట్టణంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ విద్యా సంస్థలు విచ్చ విడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి అక్బర్‌బాషా, నాయకులు హసన్, మన్సూర్, మహేంద్ర తదితరులు ఉన్నారు.

అవుకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మల్లికార్జునరెడ్డి

అవుకు: నంద్యాలలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న మల్లికార్జునరెడ్డిని అవుకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన భాస్కర్ తిరిగి సొంత జిల్లా అనంతపురంకు వెళ్లారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేద్దాం



సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

కొలిమిగుండ్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 13న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఇరికిమాను నాగేశ్వరావు కోరారు. శనివారం కొలిమిగుండ్లలోని దండోరా కమ్యూనిటీ హాల్‌లో నాయకులతో సమావేశం నిర్వహించారు. వర్గీకరణ సాకారం కానున్న నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, కొండసుంకన్న, గుర్రం పుల్లయ్య, కుళ్లాయప్ప, బాల ఓబులేసు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.